క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టీచర్ రేపాల నవీన మాట్లాడారు. విశ్రాంత తెలుగు పండిట్ విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారని లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు. ఆల్కాట్‌తోట శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో శ్రీరామానుజన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

కడియం: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలు, జల సంరక్షణ అనే అంశాలపై జరిగిన ఈ పోటీలు గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవినిర్మల ఆధ్వర్యంలో జరిగాయి. వీటికి ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

సాయం పంపిణీ

కంబాలచెరువు: కొంతకాలంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న ఏపీ ప్రత్యేక రక్షణ దళం కానిస్టేబుల్ జి.నవీన్‌కు ఎస్‌పీఎఫ్ సిబ్బంది విడతల వారీగా రూ.4.16 లక్షల సాయం అందజేశారు. ఈ మేరకు ఆ వివరాలను శనివారం ఎస్‌పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నర్సింహారావు తెలిపారు. బవసతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో నవీన్ చికిత్స పొందుతున్నారన్నారు. ఈ మేరకు నవీన్ భార్యకు సాయం చెక్కును అందజేశామన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా 'గొట్టిముక్కల'



రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రాజమహేంద్రవరం డివిజన్ సభ్యునిగా నగరానికి చెందిన న్యాయవాది గొట్టిముక్కల అనంతరావును నియమిస్తూ ఆర్డీఓ చైత్రవర్షిణి శనివారం ఆదేశాలు జారీ చేశారు. అనంతరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు, పేదలకు అందాల్సిన చట్టాలను పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా అందించేందుకు కృషి చేస్తానన్నారు.

పుస్తకావిష్కరణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.బాలయ్య, అకడమిక్ కో ఆర్డినేటర్ ఇ.సంజీవ్ కుమార్‌లు ఇండియన్ ఏపీ ఎకానమీ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. పుస్తక రచయిత, అర్థశాస్త్ర అధ్యాపకుడు ఒ.ఆనందరావును అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రరావు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు తగిన విధంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారన్నారు.

బీసీలకు ప్రాధాన్యం

సీటీఆర్ఐ: టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు ప్రాధాన్యం ఇస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. స్థానిక ఆనంద్ రీజెన్సీలో రాష్ట్ర బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. వివిధ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన నాయకులు హాజరైన ఈ సమావేశంలో యనమల మాట్లాడారు. ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీగా సురేష్‌బాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విజిలెన్స్ జిల్లా ఎస్పీగా ఎ.సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన రాజమహేంద్రవరంలోని విజిలెన్స్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా రీజినల్ విజిలెన్స్ ఎస్పీగా పనిచేసి విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వుల మేరకు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

నేతాజీనగర్‌లో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన ఇంట్లో చోరీ జరిగిందని బొమ్మూరు నేతాజీనగర్ ఆరోవీధికి చెందిన పైడిపాముల కవిత బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేతాజీనగర్‌కు చెందిన ప్రైవేట్ స్కూల్ టీచర్ కవిత శుక్రవారం ధవళేశ్వరంలోని ఆమె అమ్మ ఇంటికి వెళ్లగా, భర్త వసంతరావు విజయనగరం వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 60 గ్రాముల బంగారు ఆభరణాలను, చిన్న వెండి వస్తువులు చోరీ చేశారని కవిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన

వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సంక్షేమమే పరమావధిగా జగనన్న ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక 42వ డివిజన్లో డివిజన్ ఇన్‌చార్జ్ నామన వాసు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం రాజశేఖరరెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తనదైన ముద్రతో సీఎం జగన్ పరిపాలనలో సంస్కరణలు చేశారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీసి వాటిని పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. లలితానగర్ నాలుగో



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్

వీధి, ఈఎస్ఐ ఆసుపత్రి వెనుక వీధుల్లో వారు పర్యటించి జగనన్నను సీఎంగా మరోసారి గెలిపించాలని కోరారు. రాష్ట్ర గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిశ భవానీ ప్రియా, టీకే విశ్వేశ్వర రెడ్డి, శ్రీగౌతమీ జీవకారణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, మానే దొరబాబు, నాయకులు వజ్రనాథ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

క్లస్టర్ల వారీగా వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దామని పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సూచించారు. క్లస్టర్ త్రీ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు అధ్యక్షతన స్థానిక సిటీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్లస్టర్ సమావేశాలను విధిగా నిర్వహిస్తూ కమిటీలను ఏర్పాటు చేసుకుని పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జులు అరిగెల బాబు, లంక ప్రసాద్, దుంగ మంగాలక్ష్మి, నాయకులు నందం స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యాలను పూర్తి చేయండి

జేసీ తేజ్‌భరత్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు బ్రాంచ్‌ల పరిధిలో రూ.4.50 కోట్ల ఎన్‌పీఏ రికవరీ కోసం బ్రాంచ్‌ల వారీగా ఇచ్చిన లక్ష్యాలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని జేసీ, ది ఆర్యాపురం అర్బన్ బ్యాంకు చైర్మన్ ఎస్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ది ఆర్యాపురం అర్బన్ బ్యాంకు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ది ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పురోభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. అన్ని బ్రాంచ్‌లకు చెందిన సిబ్బందికి రికవరీ లక్ష్యాలను నిర్దేశిస్తూ కమిటీ సూచనలు జారీ చేసిందన్నారు. దీర్ఘకాలిక ఎన్‌పీఏ కేసులలో సొమ్ము రికవరీలో సహాయం, వేగవంతం చేయడానికి, కమిటీ తాత్కాలిక ప్రాతిపదికన 2వ విక్రయ అధికారిని నియమించిందన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.కామరాజు అధికారిక బాధ్యతలు స్వీకరించారన్నారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎం.జగన్నాథరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.కామరాజు పాల్గొన్నారు.

నేడు అఖిల గాండ్ల తెలికుల కార్తిక వన సమారాధన

చందనా గార్డెన్స్‌లో ఏర్పాట్లు పూర్తి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అఖిల గాండ్ల తెలికుల, దేవ తెలికుల సంఘీయుల అభ్యున్నతికి చేసే కృషిలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరంలోని చందన గార్డెన్స్‌లో కార్తిక వన సమారాధన శంఖారావానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశాఖ డిప్యూటీ మాజీ మేయర్ దాది సత్యనారాయణ, కన్వీనర్ నరవ అనంతం, స్టేట్ కోఆర్డినేటర్ నరవ గోపాలకృష్ణ, రాష్ట్ర నేతలు బుర్రా మధుసూదనరావు, అంబటి శ్రీనివాసరావు తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దాది సత్యనారాయణ, నరవ అనంతం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మున్సిపల్ స్టేడియం నుంచి భారీ ర్యాలీగా సంఘీయులు



చందన గార్డెన్స్‌లో శంఖారావం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అఖిల గాండ్ల, దేవ తెలికుల సంఘ నేతలు

బయలుదేరి చందన గార్డెన్స్‌లోని శంఖారావం వేదికకు చేరుకుంటారన్నారు. అనంతరం జరిగే సభా వేదికపై సంఘీయుల సమస్యలపై చర్చించి కార్తిక వనసమారాధన, శంఖారావం పూరిస్తారన్నారు. సమాజంలో పూర్తిగా వెనుకబడి ఉన్న తమ సంఘీయుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికంగా తోడ్పాటు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లే కార్యాచరణ చేస్తామన్నారు. సంఘీయుల హక్కులు, డిమాండ్లు సాధించుకునే లక్ష్యంతో జరుగుతున్న ఈ శంఖారావాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అడ్డాల వెంకటరాజు, సంఘ నేతలు పాల్గొన్నారు.

వచ్చే నెల 6న రిలయన్స్ క్విజ్ పోటీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 6న క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం తెలిపారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థుల్లో ఉన్న మేధా సంపత్తిని వెలికి తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. విజేతలకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, సైకిళ్లు బహుమతులుగా ఇస్తామన్నారు. దీనికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి రెండు బృందాలుగా నలుగురు విద్యార్థుల చొప్పున పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్ల నమోదు, వివరాలకు 99599 88835, 63022 23156లో సంప్రదించాలన్నారు.

పాఠశాలల సమగ్ర సమాచారాన్ని తెలపండి

కంబాలచెరువు: యుడైస్ ప్లస్ 2024, 25 సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ సమాచారం పొందుపరిచేందుకు పాఠశాలల నుంచి సమాచారాన్ని సమగ్రంగా అందించాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ సూచించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల హెచ్‌ఎంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యా సంవత్సరంలో నిర్వహించే కృత్యాలు, అడ్మిషన్లు, పాఠశాల ప్రగతి, కావాల్సిన వనరులకు సంబంధించిన అంశాలను యుడైస్ ప్లస్‌లో పొందుపరుస్తున్నారన్నారు. అదే మాదిరిగా ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల అభివృద్ధి ప్రణాళికను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలకు కావాల్సిన వసతులు, ఉన్న వనరులలో ఏఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే దానిపై విద్యా కమిటీలతో సమావేశం నిర్వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్

ఎంఐఎస్ కోఆర్డినేటర్ పద్మావతి పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలను వివరించారు. విషయ నిపుణులు ఆషిక్ ఆలీబేగ్ ఫరీకీ ఆండ్రాయిడ్ అప్లికేషన్‌పై పలు విషయాలు తెలిపారు. సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి సత్యప్రసాద్, కోటేశ్వరి, ఇందిరా, కుమారి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో దళితులపై ఎన్నో దాడులు

- మహేంద్ర మృతిపై విచారణకు సీఎం ఆదేశం
- రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ వెల్లడి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయని రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ విమర్శించారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో ఆత్మహత్యకు పాల్పడిన మహేంద్ర కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహేంద్ర ఆత్మహత్య దురదృష్టకరమన్నారు. చిన్న పొరపాటు నిండు ప్రాణాన్ని బలిగొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన బాధ్యులైన వారు ఎంతటి వారినప్పటికీ కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్ తదితరులు

ఘటనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సీబీడీ విచారణకు ఆదేశించారన్నారు. ఇప్పటికే ఎస్ఐను సస్పెండ్ చేశామన్నారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. దళితులు, అణగారిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తమ ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దళితులు, మైనార్టీలు, బీసీలపైన అనేక దాడులు జరిగాయన్నారు. కారంచేడు సంఘటనలో అగ్రవర్ణాల వారు దళితులను ఊచకోత కోశారని గుర్తు చేశారు. లక్ష్మీపురం, వేంపేట, గరగపర్రు గ్రామాలలో దళితులపై దాడులు జరిగాయన్నారు. దళితుల పట్ల ఘోరంగా వ్యవహరించిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఇప్పుడు జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. జగన్ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలలో నిజం లేదన్నారు. జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ ఈతకోట భాపన సుధారాణి, ప్రముఖ ప్రభుత్వ న్యాయవాది యార్లగడ్డ అశోక్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఔత్సాహిక గాయకులను ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎస్ఎఫ్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిబాబా, అయ్యన్న
- ఆనంకళా కేంద్రంలో అలరించిన సంగీత విభావరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఔత్సాహిక గాయనీ గాయకులను పరిచయం చేయడమే సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ ప్రధాన లక్ష్యమని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిమూలం సాయిబాబా, ఎంవీ అయ్యన్న అన్నారు. స్థానిక ఆనం కళా కేంద్రంలో శనివారం సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ ఆరో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రధనస్సు–6 పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను అలరించింది. ప్రముఖ సినీ గాయకుడు సుధీర్ గారపాటి, గాయని లక్ష్మీలతో పాటు ఎస్ఎఫ్ఎస్ సభ్యులు ఆలపించిన సినీచిత్ర గీతాలు అందరినీ ఆనంద సాగరంలో ముంచెత్తాయి. వేమగిరికి చెందిన చిన్నారి హేమాక్షి చేసిన కాంతార వరహ నృత్యరూపకం ఆకట్టుకుంది. ఎస్ఎఫ్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిమూలం



చిన్నారి హేమాక్షిని అభినందిస్తున్న సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు



సినీ సంగీత విభావరిలో సినీ గాయకుడు సందీప్ గారపాటి

సాయిబాబా, అయ్యన్న మాట్లాడుతూ సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 33 మంది సభ్యులతో ఎస్ఎఫ్ఎస్ ఒకే కుటుంబంలా ముందుకు సాగుతుందన్నారు. ఆదివారం జరిగే వరల్డ్ కప్‌లో భారత్ క్రికెట్ జట్టు విజయం సాధించాలంటూ 'జయహో భారత్' పేరుతో గీతాలాపన చేశారు. కార్యక్రమంలో నగర ప్రముఖులతో పాటు, ఎస్ఎఫ్ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు పరిశీలన



ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న పురందేశ్వరి

కడియం: వేమగిరి– బుర్రిలంక ఇసుక ర్యాంపును బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శనివారం పరిశీలించారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయని ఆమె ఆరోపించారు. జేపీ కంపెనీతో చేసుకున్న ఎంఓయూ మే నెలలో ముగిసిందని, కానీ ఇసుక దోపిడీ మాత్రం కొనసాగుతోందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నాయకులు గట్టి నరసయ్య, ఆకుల శ్రీధర్, పాటంశెట్టి రాంజీలు ఆమె వెంట ఉన్నారు.

మహిళా ఉద్యోగులు సంఘటితం కావాలి

రాజమహేంద్రవరం రూరల్: సమాజంలో అతివలపై అత్యాచారాలు, దాడుల నివారణకు ఎల్ఐసీ మహిళా ఉద్యోగులు సంఘటితంగా ఉద్యమించాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ జోనల్ నాయకురాలు కె.గీత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం భవనంలో 11వ మహిళా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ అసంఘటిత రంగంలో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ప్రజా ఉద్యమాల బలోపేతానికి కలసికట్టుగా సాగాలన్నారు. సదస్సుకు జీవిత బీమా ఉద్యోగుల సంఘ ఉభయ జిల్లాల అధ్యక్షుడు గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. మరో ముఖ్య అతిథి ఎల్ఐసీ మహిళా ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకురాలు ఎ.సూర్యప్రభ మాట్లాడుతూ రాజకీయ రంగంలోకి మహిళలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు సతీష్ ప్రయాగ మాట్లాడుతూ సంఘటితంగా ఉంటేనే హక్కులను కాపాడుకోవచ్చన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి కోదండరామ్, నగర డివిజన్



సదస్సులో మాట్లాడుతున్న జోనల్ నాయకురాలు గీత

మహిళా ఉద్యోగుల కన్వీనర్ ఆర్.శిరీష, కో కన్వీనర్లు శ్రీదేవీ, విజయదుర్గ, గాయత్రి, కవిత, సుధారాణి, ప్రసన్నకుమారి తదితరులు మాట్లాడారు. అనంతరం గీత, సూర్యప్రభలను సత్కరించారు. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని 20 శాఖా కార్యాలయాల్లోని ఉద్యోగులు, సంఘ నాయకులు గన్నెయ్య, విశ్వనాథ్, సుధాకర్, సుబ్బారావు, శ్రీనివాస్, ఈశ్వరరావు, సాయిబాబా పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ ఇండియా..



భారత క్రికెట్ జట్టు విజయం సాధించాలంటూ ఆల్ ది బెస్ట్ చెబుతున్న క్రీడాకారులు



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్స్ వీక్షించేందుకు ఏర్పాటు చేసిన జెయింట్ స్క్రీన్

క్రికెట్ టీమ్‌కు శుభాకాంక్షలు

రాజమహేంద్రవరం సిటీ: ఆదివారం జరిగే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ క్రికెట్ జట్టు విజయం సాధించాలని నగరానికి చెందిన క్రికెట్ క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో క్రికెట్ సబ్ సెంటర్ కోచ్ జీరి హరనాథరెడ్డి ఆధ్వర్యంలో భారత్ జట్టుకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా హరనాథరెడ్డి మాట్లాడుతూ భారత్ జట్టు బౌలింగ్, బ్యాటింగ్‌లలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తుందన్నారు. దేశ ప్రజలు ఆకాంక్ష మేరకు ఆస్ట్రేలియాపై ఘన విజయాన్ని సాధించడం ఖాయమన్నారు. అనంతరం క్రికెట్ క్రీడాకారులంతా ఆల్ ది బెస్ట్ చెప్పారు. క్రికెట్ కోచ్ హకీం పాషా, అండర్ –23 క్రికెట్ క్రీడాకారుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

ధవళేశ్వరం: పోలీసు సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యం కోసం, నిత్యం ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకునేందుకు క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచించారు. ధవళేశ్వరంలో పోలీస్ వెల్ఫేర్ నిధుల నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన రెండు షటిల్ కోర్టులను ఎస్పీ శనివారం ప్రారంభించారు. తొలుత పోలీస్ అధికారులు, విద్యార్థులతో కలసి ఆయన కొంతసేపు షటిల్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం వ్యాయామం అలవాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలని అన్నారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఈ సెటిల్ కోర్టులు అందుబాటులో ఉంటాయన్నారు. ఖాళీ సమయంలో షటిల్ ఆడుకోవచ్చని, అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ధవళేశ్వరంలోని యువత కూడా పోలీసులతో కలసి ఈ షటిల్ గ్రౌండ్‌ను ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేశారు. అనంతరం షటిల్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖరరాజు, సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీరామవర్మ, సీఐలు మంగాదేవి, తిలక్, గణేష్, ఎస్సైలు ఎం.కేశవరావు, సత్యనారాయణ, ఏఎస్సైలు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో షటిల్ కోర్టు ప్రారంభిస్తున్న ఎస్పీ